వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- పలు గ్రామాల్లో ఇప్పటికే స్లాబ్ వరకు పూర్తయిన ఇళ్లు
- బేస్‌మెంట్ వరకు పూర్తయిన నిర్మాణాలకు మొదటి విడత డబ్బులు జమ
- నెరవేరుతున్న పేదల సొంతింటి కల

మాడుగులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజల సొంతింటి కల నెరవేరుస్తోంది. మొదటి విడతలో స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5లక్షల సాయం అందిస్తోంది. ముందుగా పైలట్‌గా ఎంపికైన గ్రామాల్లో ఇళ్లు మంజూరు చేయగా ఆ తరువాత మిగతా గ్రామాల్లో సైతం మంజూరు చేయగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులు చకచకా జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే కొన్ని ఇళ్లు స్లాబ్ వరకు పూర్తి చేసుకోగా మరికొన్ని గ్రామాల్లో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. బేస్‌మెంట్ వరకు పూర్తయిన నిర్మాణాలకు మొదటి విడత డబ్బులను లబ్ధిదారుల అకౌంట్‌లో జమ అయ్యాయి. పిల్లర్లు మొదలుకొని స్లాబ్, గోడలు ఇలా గృహ ప్రవేశంలోపు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో మొత్తం రూ.5లక్షలను ప్రభుత్వం జమ చేయనుంది. ఏళ్ల తరబడి ఇళ్లు లేని తమకు ప్రభుత్వం సొంతింటి కలను నెరవేరుస్తుండడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


దాచారం గ్రామంలో స్లాబ్ లెవల్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

504 మంది లబ్ధిదారులు

మాడుగులపల్లి మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా ఇళ్లు లేని 504 మంది నిరుపేదలను గుర్తించారు. మొదటి విడతలో స్థలం ఉండి ఇల్లు లేని వారిని ప్రభుత్వం లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. దాచారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆగామోత్కూర్‌లో -36 మంది, భీమనపల్లిలో -10 మంది, బొమ్మకల్-13, చిరుమర్తి -21, గండ్రవానిగూడెం -6, గుర్రప్పగూడెం-13, ఇస్కబాయిగూడెం-1, కల్వలపాలెం-7, కుక్కడం-15, పాములపాడు -19, పోరెడ్డిగూడెం -11, సీత్యాతండా-5, తోపుచర్ల-26, అభంగాపురం -7, ధర్మాపురం-12, గజలాపురం-9, గారెకుంటపాలెం-6, గోపాలపురం-4, కన్నెకల్ -14, కేశవాపురం-5, మాచనపల్లి-7, నారాయణపురం-11, పూసలపాడు-9, చెరువుపల్లి-36, దాచారం-55, ఇందుగుల-54, కొత్తగూడెం, 11, మాడ్గులపల్లి- 81 మంది మొత్తం 504 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది.

సొంతింటి కల నిజమవుతోంది


మాకు సొంత ఇల్లు లేక ఎనిమిదేళ్లుగా గుడిసెలో ఉన్నాం. గత ప్రభుత్వంలో ఇల్లు వస్తుందని ఆశించాం కాని రాలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఇస్తుందో లేదో అనుకున్నాం కానీ దరఖాస్తు చేసుకోగా మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం స్లాబ్ వరకు ఇంటి నిర్మాణం పూర్తయింది. మాకు సొంత ఇంటి కల నిజమవుతోంది.

– జానకమ్మ, దాచారం

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం


మండలంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం. మొదటి విడతలో రాని వారికి రెండవ విడతలో అందిస్తాం. ఎవరూ అధైర్యపడవద్దు.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ, మాడుగులపల్లి

క్లుప్తంగా

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

గుర్రంపోడు : మండలంలోని జునూతుల గ్రామంలో వివాహితను కిరాతకంగా హత్య చేసిన నిందితుడు మహేష్‌ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా గుర్రంపోడులో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఆమె వెంట ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన అనురాధ, సహాయ కార్యదర్శి కొండా అనురాధ, సీపీఎం మండల కార్యదర్శి వనమాల కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన


బురదమయంగా మారిన ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారిన ప్రాంతాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ఈదులగూడెం ప్రాంతాల నుంచి ఫిర్యాదులు రావడంతో స్వయంగా ఆయన పర్యటించారు. ఈదులగూడెం ప్రాంతాల్లోని పెట్రోల్ పంపు ఎదురుగా, ధరణి వెంచర్ రోడ్డు, తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఏఈ సాయితేజ మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కొండమల్లేపల్లి: చందంపేట మండలం సంగ్రలగడ్డ గ్రామానికి చెందిన నోముల వీరయ్య కొండమల్లేపల్లి పట్టణంలోని ట్రాక్టర్ షోరూంలో పని చేస్తూ భార్య అనిత, ఇద్దరు కుమారులతో కలిసి పట్టణంలోని సాగర్ రోడ్డులో గల జీబీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత పది రోజుల క్రితం వీరయ్య భార్య అనిత అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందింది. వీరయ్యతో పాటు పదో తరగతి (2003-04) విజయమేరి ఉన్నత పాఠశాలలో చదువుకున్న స్నేహితులు అతడిని పరామర్శించారు. రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. వారిలో అమరేందర్ రెడ్డి, యాదగిరి, శశిధర్‌రెడ్డి, కస్తూర్‌లాల్, సతీష్, వెంకటయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్‌కు దరఖాస్తు చేసుకోవాలి

చింతపల్లి: చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరమని చింతపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమావత్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్ చేయాలనుకునే వారు ఈ నెల 12వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సాధారణ ఫీజు, 12 నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు లేటు ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

హాలియా : సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సహకారంతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్ అన్నారు. బుధవారం హాలియా మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ప్రసాద్ నాయక్, శ్రీనివాస్, ముత్యాలు, గోర్ల ఈదయ్య, సైదులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా హరికృష్ణారెడ్డి

మాడుగులపల్లి: మండలంలోని పాములపాడు కాంగ్రెస్ గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా సబ్బు హరికృష్ణారెడ్డి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మాంద్ర గిరియాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తీగల సతీష్, ప్రధాన కార్యదర్శిగా మామిడి సైదులు, కోశాధికారిగా నంద్యాల అంబేద్కర్, యూత్ ప్రెసిడెంట్‌గా కునుకుంట్ల సతీష్, యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

బాలాజీనగర్‌కు ఆర్టీసీ బస్సు నడిపించాలి


ఆర్టీసీ ఏటీఎంకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలం బాలాజీనగర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని బుధవారం ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భారతీబాయికి తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బస్సు సౌకర్యం కల్పించే విధంగా చూస్తానని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పేర్కొన్నట్లు వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు లావూరి క్రాంతికుమార్ తదితరులున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



దామరచర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ కోరారు. ఈమేరకు బుధవారం ఆయన తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి విద్యార్థులు అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు సరిపడా బాత్‌రూమ్‌లు నిర్మించాలని, క్రీడా వస్తువులు అందించాలన్నారు. లేకుంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అజయ్, విష్ణు, సాగర్, నాగ తదితరులు పాల్గొన్నారు.

పరుచుకున్న గుర్రపు డెక్క


చిన్న చెరువులో పరుచుకున్న గుర్రపు డెక్క

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల చిన్న చెరువులో గుర్రపు డెక్క చాపలా పరుచుకుంది. ఈ చెరువు పరిధిలోని వందలాది ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఈ చెరువు నిండా గుర్రపు డెక్క పరుచుకోవడంతో నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులో గల గుర్రపు డెక్కను పూర్తి స్థాయిలో తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై విచారణ జరిపించాలి

చింతపల్లి: మండల కేంద్రంలో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సు నడుపుతున్న నాగార్జున గ్రామర్ హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య దేవరకొండ డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ శంషోద్దీన్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. విచారణ జరిపి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎర్ర చిన్న తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దఅడిశర్లపల్లి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిన వెంకన్న, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీవన్‌కుమార్, సీహెచ్ వెంకటయ్య, జైపాల్, వై శ్రీనివాస్, శివయ్య, మంగ సుజాత, రవికుమార్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

దేవరకొండ: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. బీఆర్‌ఎస్వీ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవరకొండ మండల పరిధిలో గల మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యాశాఖ బడ్జెట్‌ను 15శాతం పెంచుతామని మేనిఫెస్టోలో ప్రకటించి 7 శాతానికే పరిమితం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యాశాఖను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజు వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాత్లావత్ లక్ష్మణ్, హరికృష్ణ, వెంకటేష్, మహేష్, హరి, శ్రీను తదితరులున్నారు.


దేవరకొండలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణ

ఉద్యోగాల సాధనకు 4న చలో సెక్రటేరియట్


మాట్లాడుతున్న రవినాయక్

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడి చేపడుతున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించి గత ప్రభుత్వ నోటిఫికేషన్లలో కలిపి కేవలం 55వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందన్నారు. ఇంకా లక్షా 45 వేల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చలో సెక్రటేరియట్‌కు నిరుద్యోగ యువతీ, యువకులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు పాతాని శ్రీను, నాగేంద్రప్రసాద్, వదుద్, భిక్షం, వినోద్, బాబు, ఆశీర్వాదం, శ్రీను తదితరులున్నారు.

పావలా వడ్డీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : నమస్తే పథకం కింద పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ. రాష్ట్ర కో ఆర్డినేటర్ మారుతి ప్రసాద్ కోరారు. చెత్త సేకరించే వారు, పాత ఇనుము, చిక్కు వెంట్రుకలు కొనుగోలు చేసే వారికి బుధవారం మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నమస్తే పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వంద రోజుల కార్యాచరణలో భాగంగా పారిశుద్ధ్యంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములుగా ఉన్న 200 మంది లబ్ధిదారులకు నమస్తే పథకాన్ని వర్తింప చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం కింద పావలా వడ్డీకి రూ.5లక్షల వరకు రుణ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని, ఆయుష్మాన్ భారత్ కింద రూ.5లక్షల వరకు వైద్యానికి చేయూతనిస్తుందన్నారు. కార్యక్రమంలో నవజీవన్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీకాంతమ్మ, నమస్తే పథకం నోడల్ అధికారిని శ్వేతారెడ్డి, ఆర్‌ఓ, ఇన్‌చార్జీ మేనేజర్ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఆజ్మీర కిరణ్, మెప్మా సీఓ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.


మాట్లాడుతున్న నవజీవన్ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ మారుతి ప్రసాద్

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి


ఎంఈఓ బాలుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మిర్యాలగూడ: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం-2009ను అమలు చేయాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ సురేష్ అన్నారు. ఈమేరకు బుధవారం మిర్యాలగూడలో ఎంఈఓ బాలుకు ఆయన వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలన్నారు. అధిక ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఇన్‌చార్జి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

దేవరకొండ: వైద్యుల సేవలు వెలకట్టలేనివని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఉత్తమ డాక్టర్లుగా అవార్డు అందుకున్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను బుధవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో వైద్యులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ శేఖర్, నేతాళ్ల వెంకటేష్, గుండాల అంజయ్య, సహదేవ్, నాగేంద్ర, సుమన్, రెడ్డి శంకర్, హరి, చంద్రీశ్వర్, అజయ్, రమేష్, వెంకటేష్, ప్రమోద్ తదితరులున్నారు.


రవిప్రకాష్‌ను సన్మానిస్తున్న నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు

నిడమనూరు : నిడమనూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర ఎన్నికల అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కల్పించారు. కొత్త ఓటర్ల నమోదు, వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ వంటి అంశాలపై తహసీల్దార్లకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నిడమనూరు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, తిరుమలగిరి-సాగర్ తహసీల్దార్ అనిల్, రఘు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

నల్లగొండ: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా అశ్రఫ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అహ్మద్‌లను నియమిస్తూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వహిషా ఖాద్రీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ అధ్యక్షులుగా మహమ్మద్ బుర్హానుద్దీన్, సయ్యద్ శాకీర్, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ ఫజల్ అహ్మద్, ముహమ్మద్ తౌసీఫ్ అహ్మద్, కోశాధికారిగా సయ్యద్ రఫీ, అదనపు ప్రధాన కార్యదర్శిగా ముహమ్మద్ సైపుద్దీన్, జాయింట్ సెక్రటరీగా ఎండీ అబ్దుల్ షహబాజ్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా కేఎం సుసురత్ వలీని నియమించారు. కార్యవర్గ సభ్యులుగా షేక్ మొహమ్మద్ రఫీ, వహీదు రహమాన్, సలహాదారులుగా ఎంఏ వసీం కరీం నియామకమయ్యారు. ఈ నియామక ఉత్తర్వులు మూడు సంవత్సరాలు అమలులో ఉంటాయని మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.

క్రిస్టియన్లకు ప్రాధాన్యత ఇవ్వాలి

రామగిరి(నల్లగొండ): నామినేటెడ్ పోస్టుల్లో క్రిస్టియన్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేఖల భద్రాద్రి బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించడంలో క్రియాశీలక పాత్ర పోషించామన్నారు. క్రిస్టియన్లకు రెండు కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా జిల్లాలోని క్రైస్తవులకు సమాధులు, చర్చీల నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎస్ క్రిస్టోఫర్, జయప్రకాష్, కట్ట మోజేష్, బిషప్ సమర్పణ కుమార్, ఇసాక్, ఆశయ్య, ప్రవీణ్, నతనియన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

త్రిపురారం : మాటూర్ సమీపంలో 400 కేవీ ట్రాన్స్‌విఎషన్ పనుల కారణంగా 220-132-33 కేవీ మిర్యాలగూడ సబ్ స్టేషన్ నుంచి వచ్చే మాటూర్ 33 కేవీ, 11 కేవీ మాటూర్ సబ్ స్టేషన్, హర్జతండా ఫీడర్లకు గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు త్రిపురారం విద్యుత్ ఏఈ బాలు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఫీడర్ల పరిధిలోని మాటూర్, గుడితండా, వస్రాం తండా, లక్పతి తండా, చెన్నాయిపాలెం, అల్వాలపాడు, సత్యంపాడు తండా, చౌళ్లతండా, దుబ్బతండా, రూప్ల తండా, హజ్జతండా, బొర్రాయిపాలెం, లోక్యాతండా మంగళితండా, సూర్యతండా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుంతల రోడ్డుతో అవస్థలు


గుంతలమయంగా మారిన మాడ్గులపల్లి- చెరుపల్లి రోడ్డులో నిలిచిన వరద నీరు

మాడుగులపల్లి: మండల కేంద్రం నుంచి చెరుపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నిర్మించి సుమారు 20 సంవత్సరాలు అవుతుండడంతో రోడ్డు గుంతలు పడి కంకర తేలింది. వర్షాకాలంలో రోడ్డుపై వరద నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.